# తోసుకు వచ్చిన ముహూర్తం

హేమలత కళ్ళుతెరచి చుట్టూ కలయజూసింది. తన క్వార్టర్సులో మధ్య గదిలో మంచమ్మీదనేనా ఉన్నది? ఆ సంగతి ఖాయపరచుకొనటానికి ఆమెకు అర గంటకు పైగా పట్టింది. ఒళ్ళంతా చెమట పట్టింది. లేస్తే కళ్లు తిరుగుతున్నాయి. లేవబోయి మంచమ్మీద వాలిపోయింది.

ఆమెకు ఉదయము హాస్పిటల్లో రౌండ్సు చేస్తుండగా తల తిరిగినట్టు జ్ఞాపకం. అంతే. తరువాత ఏం జరిగింది?

కళ్లు మూతలుపడ్డాయి. పనిమనిషిని కేకవేసే శక్తిలేక చేతిదగ్గరగా బల్లమీద ఉన్న గంటనొక్కింది. కాఫీ కావాలని చేతిసైగచేత తెప్పించుకుని తాగింది. తల నొప్పి తగ్గలేదు. కణతలు పగిలిపోతున్నాయి. కణతలకు మందురాసుకుంటూ కళ్లు మూసుకు పడుకుంది. ఒక గంటయినా కాలేదు కాని యుగాలు గడచినట్టుగా ఉంది ఆమెకు.

ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. 'మాత్ర వేసుకుని కళ్లుమూసుకు పడుకో' అని రోగులను మందలిస్తే వాళ్లు పడుకోలేదూ? తనలా పడుకోలేదేం? ఆమెకు నవ్వు వచ్చింది. తను డాక్టరుగా వాళ్ళను దబాయించి ఒక్కొక్క మంచాన్నే దాట వేసు కుంటూ తనలో తాను నవ్వుకునేది, 'వాళ్లు రోగులు-పాపం రోగులు' మనసులోనే గొణుక్కున్నది.

పక్కమీద దొర్లిదొర్లి ఒత్తిగిలి పడుకున్నది, దిండ్లు సర్దుకున్నది. శాలువ కప్పుకున్నది. అయినా పక్క కుదిరినట్టుగాలేదు. తలా ఒళ్ళూ నొప్పులు, సూదులు పెట్టి - కాదు దబ్బనాలుపెట్టి పొడిచినట్లుగా ఒకటే బాధ. డాక్టరయిన తరువాత ఏస్ప్రో వేసుకుంటే పోయిన నొప్పులే కాని ఇంతవరకూ పడకపెట్టలేదు. ఇలాంటి బాధ ఇంతవరకూ రాలేదు.

తలక్రింద రెండుచేతులూ పెట్టుకొని కప్పువైపు కళ్ళారకుండా చూస్తూ ఆలోచనా సముద్రంలో మునిగిపోయింది. సుమతి తలుపు తోసుకుని లోపలికి రావటంతో ఆమె ఆలోచనకు అంతరాయం కలిగింది.

''ఏమిటీ వాలకం? అలా పడుకున్నావేం? ముఖం చూస్తే పది లంఖణాలు చేసినట్టున్నావు?''

సుమతిని చూడగానే హేమలత ప్రాణాలు లేచివచ్చినట్లయింది. నవ్వుతూ పడక్కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పింది. బాధకూడా కొంచెం కొంచెంగా తగ్గుతున్నట్టుగా ఉంది. తలలోనుంచి బరువు దిగిపోతున్నట్లయింది.

'వెంకటచలం వస్తాడు సెలవుల్లో?'

హేమలత గుండె గతుక్కుమన్నది. ముఖం అంతలోకి ముడుచుపోయింది. 'నాకు తెలియదు'-చటుక్కున విసురుగా అన్నది.

సుమతి ఆశ్చర్యపడ్డ దామాటకు. కాని పైకి కనబడకుండా జాగ్రత్తగా సర్దుకుంటూ' వస్తానని నాకు రాశాడులే. అందుకని అడిగాను' అన్నది.

''వస్తే రావచ్చు సుమతీ. దానికేముందీ? పినతల్లి కూతురు ఉంటే చూడాలనిపించదా ఎవరికయినా?''

''అదేమిటి? కొత్తగా మాట్లాడుతున్నావు హేమా! ఇంతకాలమూ పినతల్లి కూతురుకోసమేనా సెలవుపెట్టి వస్తూ ఉండేవాడు?''

'ఇంక అంతే!'-హేమలత ముఖము అవతలికి తిప్పుకుంది,

సుమతి పైట చెంగు చాటుచేసుకుని నవ్వుకుంది. ఇది రెండవ పర్యాయము ఇలా జరగటము. రెండేళ్ళ క్రిందట డాక్టరు వెంకటచలానికీ హేమలతకూ పెళ్ళి అవుతుందని అంతా అనుకున్నారు. కాని అంతవరకూ రాలేదు. వెంకటచలము ఇల్లూ వాకిలీ ఏర్పరచుకొని కావలసిన ఫర్నీచరంతా కొన్నాడు. పెళ్ళి ఏర్పాట్లను గురించి మాట్లాడటానికి వచ్చినవాడు ఇంకెవరినీ కలవకుండానే తెల్లవారుఝామున బయలుదేరే రైలు ఎక్కి వెళ్ళిపోయాడు. ఇప్పుడూ అంతే కాబోలు!

'అబ్బ! నీవెంత పెంకిదానివి హేమా? నీమనసులో ఏమున్నదో ఎవరూ కనుక్కోలేరు' సుమతి ఎంతో గట్టిగా మందలించాలనుకుంటే నాలుక తడబడ్డట్టయింది

హేమలత పెదవుల మీద చిరునవ్వు మెరుపులా మెరిసి మాయమయింది. "సరే గాని సుమతీ! నిన్ను చూడగానే నాతల నొప్పి ఒళ్ళు నొప్పులూ ఎట్లా మాయమయ్యాయో చూశావా? రాత్రంతా ఇలా కబుర్లు చెబుతూ ఇక్కడే ఉండిపోకూడదూ?" మంచమ్మీది నుంచి లేచి సుమతి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అప్యాయంగా నొక్కింది హేమ.

"నన్ను చూడగానే నీకు నిజంగా బాధ తగ్గిందంటే ఇక్కడే ఉండి పోవాలని ఉంది. కాని ఇంట్లో పిల్లల నెవరు చూస్తారు? రేపు మళ్లీ వస్తాగా!"

"అయితే వెళ్తానంటావా?" చిన్నపిల్లలా గునిసింది.

"మా యింటికి రారాదూ ఈపూటకు? తగ్గగానే వచ్చేద్దుగాని"

"ఈకాస్తకూ ఇల్లు బయలుదేరితే అంతా నవ్వరూ?" సుమతి నవ్వుతుంటే హేమలత కూడా నవ్వేసింది.

సుమతి వెళ్ళగానే మళ్లీ ఒంటరిదయిపోయింది. తలలో ఏదోబాధ మళ్లీ బయలుదేరింది దబ్బనాలతో పొడిచినట్టుగా ఉంది ఈసారి.

నిద్ర రావటానికి ఒక మాత్ర సీసాలోనుంచి తీసి వేసుకున్నది. బొమ్మలు చూస్తూ కాగితాలు తిప్పింది. లేచి గ్లాసెడు మంచినీళ్లు తాగింది. కాళ్లకింద దిండు ఎత్తుగా పెట్టుకున్నది. ఎత్తు ఎక్కువయిందని మళ్లీ సర్దుకున్నది. మగతగా కళ్లు మూతలు పడుతున్నాయి. మధ్యమధ్య చురుక్కుమన్నట్టుగా బాధ! తనజన్మలో ఎప్పుడయినా వచ్చిందా? ఏమో? ఏమో?.... కళ్లు మూతలుపడ్డాయి.

ఆవలిస్తూ బద్ధకంగా కళ్లు తెరచిచూస్తే చిన్నముల్లు ఏడుమీద ఉన్నది. ఇది సాయంత్రమా? ఉదయమా? తూలుతూ వరండాలోకివచ్చి చూసింది. హాస్పిటల్లో దీపాలు_ఆవరణమంతా దీపాలు. మినుకు మినుకుమంటూ ఊరినిండా దీపాలు కనబడ్డాయి.

నౌకరు తెచ్చి ఇచ్చిన పాలుతాగి ఒక స్లయిసు బ్రెడ్ తిన్నది.

తనకిలా సుస్తీ ఎప్పుడయినా చేసిందా? ఉద్యోగంచేస్తున్న ఈ నాలుగేళ్లలో ఎప్పుడూ ఇంతబాధ కలుగలేదు. మెడికల్‌కోర్సు చదువుతుండగా వచ్చిన జ్ఞాపకం లేదు. కాని అంతకంటె పదిరెట్లుగా ఇంటరు చదువుతూ హాస్టల్లో ఉన్నప్పుడు వచ్చింది. గదిలో మంచ మీ్మద ఒళ్లు తెలియకుండా పడుకొని మూలుగుతూ ఉంటే వార్డను హాస్పిటల్లో చేర్పించింది. అది టైఫాయిడ్ అయింది.

జ్వరందేమిటి? డాక్టర్లు మందులు రాయటం, వేళచొప్పున నర్సులు ఆ మందులు మింగించటం అలా ఇరవై అయిదు రోజులు అక్కడ ఉండటం పెద్దబాధ అనిపించలేదు. మొదట్లో నాలుగు రోజులు బాధపడ్డమాట నిజము. పలకరించే దిక్కులేక, అలా మంచంమీద పడుకుని, సాయంత్రము కాగానే కిలకిల్లాడుతూ వచ్చే తమవాళ్లతో బాధలన్నీ మరచి మాట్లాడే రోగులను చూస్తూ ఉండేది.

జ్వరం తగ్గిపోయింది. హాస్టలుకు వెళ్ళవచ్చునన్నారు డాక్టర్లు, ఆలోచిస్తూ పడుకుంది. మళ్ళీ హాస్టలుకు వెళ్ళాలి. ఉక్కు మనిషిలాంటి వార్డెను చేతిలో మెలగాలి.

హేమలత మంచమ్మీదనుంచి లేచి నిడుపాటి జడను ఒయ్యారంగా ఆడిస్తూ తన కంటె ఎత్తుగా ఉన్న కిటికీ దగ్గర నిలబడ్డది. విశాలమైన ఆవరణంలో చుట్టూ ఉన్న తురాయిచెట్లు పాదం మునిగేటంతవరకూ పూలు రాల్తాయి. చెట్లకిందంతా ఎర్రటి కుంకుమ రాసులురాసులుగా పోసినట్లుంది. రెండో అంతస్తు పైనుంచి చూస్తే చెట్టుకు ఒక్క ఆకయినా కనబడదు. అన్నిపూలు, ఆ ఎరుపులోనుంచి తెల్లటిచీరె కట్టుకుని కుసుమ గేటుదాటి మెల్లగా లోపలికి వస్తున్నది. ఆమె ముఖం మంచుకు వికసించిన మల్లెమొగ్గలా ఉన్నది. మనిషి సన్నగా ఉన్నా నిండుగా ఉన్నది. కుసుమను చూడగానే ఎదురుగా వెళ్ళి బుజాలమీద చేతులువేసి తీసుకు వచ్చి కుర్చీమీద కూర్చోబెట్టుకుంది.

''ఈ ఇరవై అయిదు రోజులనుంచీ నీవు ఇక్కడున్నట్టు నాకు తెలియదు సుమా. నీవు కనబడకపోతే రెండు మూడు సార్లు నీ క్లాసుమేట్సును అడిగాను కూడాను. ఎవరూ సరిగా జవాబే చెప్పలేదు. నిన్న హాస్టలుకు వెళ్ళి మీ వార్డెను

షడిగాను. తెలిసినప్పటి నుంచీ నీవెలా ఉన్నావోనని బాధపడిపోతున్నాను. ఈ రొట్టె తిను' ఆప్యాయంగా చేతిలో పెట్టింది.

''నర్సులు యిచ్చిన పాలుతాగి బ్రెడ్ తిన్నాను. ఇంకేం కావాలి?''

''హేమా! యిన్నాళ్లనుంచీ ఒక్కదానవూ యిక్కడ ఎంత బాధపడ్డావ్. నేను ఊహించుకున్నాను. నాకు యిన్నాళ్లనుంచీ తెలియలేదని కాని తెలిస్తే ఎలా వచ్చేదాన్నో? అన్నయ్యకు ఒళ్లు బాగాలేదు. అమ్మ ఒక్కతే! బజారు పనులన్నీ నేనే చెయ్యాల్సి వచ్చింది....''

హేమలత కళ్లల్లో అప్పటికే నిండా నీరు కమ్మింది.

''నేను తెచ్చిన బ్రెడ్ తినవూ? నీవేమీ తినలేవని తెచ్చాననుకున్నావా? తిన్నావులే. ఇది కూడా తినాలని తెచ్చాను. నీకు జ్వరం తగ్గిందిగా. ఇంటికి రావటాని కేమభ్యంతరం?' బుజమ్మీద చెయ్యేసింది.

''డాక్టర్లు వెళ్లమన్నారు. రేపు వెళ్ళిపోతాను'' దిగులుగా ముఖంపెట్టి ఒక పక్కకు తిప్పుకుంది.

''డిస్చార్జి చెయ్యగానే హాస్టలుకు వెళ్ళిపోవాలా? కాస్త బలంవచ్చి బాగా తిరగగలిగేటంతవరకూ మా యింట్లో వచ్చి ఉండు. ఇంతలోకి అరిగిపోవులే. పథ్యం బాగా వంటబట్టిన తరువాత నేను వచ్చి దింపుతాను సరేనా?''

''జ్వరమయితే తగ్గిపోయింది. పథ్యం హాస్టల్లో పెడతారులే. ఈ కాస్త దానికి మీ యింటికి ఎందుకూ?'' జడ కొనలను అరచేతిమీద కొట్టుకుంటూ ఓర కంటితో కుసుమ ఏమంటుందోనని చూసింది.

''అదికాదు హేమా. పథ్యమంటే మీ హాస్టల్లో పెట్టేదికాదు. ఇంటివాళ్లెవరయినా జాగ్రత్తగా చేసి ఆప్యాయంగా తినిపించాలి.''

హేమలతకు ఆ క్రిందటిరోజు నాలుగవ నెంబరు గదిలో చూసిన దృశ్యం మళ్ళీ కళ్ళ ముందర కనబడినట్లయింది. ఒకనాడు ఆ అమ్మాయి పాలుతాగనని -మారాము చేసిందట. అన్నం పెట్టమని గొడవచేసిందట. తను చూసిన్నాడు పాత

చింతకాయ పచ్చడి. పొట్లకాయ కూర అన్నములో కలిపి ముద్దలుచేసి చేతిలో పెడుతున్నది తల్లి. ఆ పచ్చడీ కూరా వొంటికి ఎంత మంచివో, వాటి రుచులు ఎంత బాగుంటాయో ఊరించి ఊరించి చెబుతున్నది. ఆ దృశ్యము తలవుకురాగానే హేమలతకు కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

''ఏమిటీ ఆలోచిస్తున్నావు హేమా? మా యింటికి రాకూడదా? నీవు రానన్నా రెక్క పుచ్చుకుని లాక్కెళ్లుతాను ఏమకుంటున్నావో?'' కుసుమ కనుబొమలు పైకెత్తి బెదిరించింది.

హేమలత ఓపికలేకపోయినా కడుపు గట్టిగా పట్టుకుని శుష్కించిన చెంపలు గుంటలు పడేలా నవ్వింది.

''నీకెందుకూ పో శ్రమ అని చూస్తున్నాను కుసుమా'' ఆ మాటలో ఎంత మొహమాటము మూట కట్టినటుగా ఉన్నదో కుసుమ అంచనా వేసుకున్నది.

మరునాడు కుసుమవచ్చి హేమలతను వాళ్ల యింటికి తీసుకువెళ్లింది. కుసుమ తన గదిలోనే హేమలతకు మంచము వేసింది. వేడివేడి నీళ్ల స్నానము చెయ్యాగానే అలసటవచ్చి హేమలత కళ్ళు మూసుకుని పడుకున్నది.

''ఇక్కడికే అన్నీ తెచ్చానమ్మా. మెల్లగా లేచి ఈ పీటమీద కూర్చుంటావా?''

హేమలత కళ్లుతెరచి గడియారము చూసుకున్నది. పదకొండు గంటలు.

'అమ్మాయీ! నీవు మొహమాటపడకు. అన్నరసం కడుపులో పడితేనే గాని నీకా దడ తగ్గదు. చారన్నం తిని నోటికి రుచిగాఉందో లేదో చెప్పు. ఇన్నాళ్లనుంచీ నాలుక చవి చచ్చిపోయిందామెను. అందుకే కాస్త పుల్లపుల్లగా ఉండాలని చారు చేశాను. పాలన్నంలోకి ఈ నిమ్మకాయముక్క నంచుకో.'' కుసుమతల్లి హేమలతకు ఎదురుగా పీటవేసుకూర్చుంది.

హేమలత ఉక్కిరిబిక్కిరయిపోయింది. తన కెప్పుడూ అనుభవములేని ఆదరమూ ప్రేమా కుసుమతల్లి చూపిస్తుంటే హేమలతకు ఏమనటానికి తోచటంలేదు కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

"ఆ కాస్తఅన్నం కలుపమ్మా."

కళ్లనీళ్లు చెంపలమీదుగా జారటంచేత ఆమె చూడకుండా ఉండాలని హేమ-లత ముఖం పక్కకు తిప్పుకున్నది.

"పిచ్చిపిల్లా ఎందుకు కన్నీళ్లు? రేపీపాటికి శుభ్రంగా తిరుగుతావు. మంచి టానిక్కు తీసుకుంటే బాగా బలం వస్తుంది. వచ్చే వారానికల్లా వెనకటి హేమ-లతకు మించిపోతావు".

"అందుక్కాదండీ" కన్నీళ్లు తుడుచుకుని నవ్వటానికి ప్రయత్నించింది.

"చూడు అన్నం తినగానే పడుకోకూడదు. నాతో పేకాటయినా ఆడు, అది యిష్టంలేకపోతే గవ్వలాటయినా ఆడు. అన్నం అరిగిన తరువాత నీ యిష్టం వచ్చినంతసేపు నిద్రపో-ఏం?" ఆమె ముఖం మూతి నొసలు చిన్నపిల్లలతో మాట్లాడేప్పుడు ఉన్నట్టుగా ఉన్నాయి.

"మా అమ్మ చెప్పినట్టు వినకపోతే ఊరుకోరు హేమా. ఆవిడ మా పెద్ద మనిషి. ఆమె మాట వింటేనే మనకు సుఖమనుకో. సాధింపులు ఉండవు" కుసుమ హేమలత పక్కన కూర్చున్నది బుజమ్మీద చెయ్యివేస్తూ.

కుసుమ యింట్లో వారంరోజులు నిమిషాల్లా గడిచిపోయాయి. ఆమె తల్లి మణెమ్మ హేమలతకు ఒకనాడు బలవంతంగా తలంటి నీళ్ళు పోసింది. సాంబ్రాణి పొగవేసి తలవెంట్రుకలు ఆరబెట్టింది.

ఎవరూ దగ్గరలేనప్పుడు దిగులుపడ్డ ముఖంతో శూన్యంలోకి చూస్తూ గంటల తరబడి కూర్చునేది హేమలత. అలాంటి సమయాలలో బలమైన చెయ్యి ఆమె వీపు మీద పడేది. 'ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?' మణెమ్మ ముఖంలో ముఖంపెట్టి అడగ్గానే కళ్ళు అదోకమాదిరిగా అయి బరువెక్కి మూతలుపడేవి. ఆమె ఒడిలో తలపెట్టుకొని ఆతల్లి వాత్సల్యాన్ని పొందాలని హేమలత మనసు తహతహలాడిపొయ్యేది. ఆమె బుజమ్మీద తల ఆన్చి తనకు జీవితంలో ఇంత వరకూ తెలియని ఆప్రేమను పొందాలనిపించేది. రాత్రిళ్లు పడుకోబోయే ముందు ఆమె వచ్చి 'పిచ్చిపిల్లా! వెర్రివెర్రి ఆలోచనలు పెట్టుకోక సుఖంగా నిద్రపో'అంటూ తల నిమిరితే ఎంతో హాయిగా నిద్రపట్టేది.

సాయంకాలము నాలుగుగంటలకు వాకిట్లో బండి వచ్చి నిలబడ్డది. హేమ లత తన సామాను సర్దుకుంది. ఆమె మనసు బరువుగా వుంది. ఆత్మీయత ఆద రమూ ఇలా ఉంటాయని చూపెట్టిన మణెమ్మను వదలిపోవాలంటే గుండెలో పెద్ద బరువు పెట్టినట్టుగా ఉన్నది. బండిఎక్కేటప్పుడు వెళ్ళుతున్నానని చెప్పలేకపోయింది గొంతులో ఏదో అడ్డము పడ్డట్టయింది. మాట స్తంభించిపోయింది. కంఠము గద్గద మయింది. వెళ్ళుతున్నట్టుగా తల ఆడించింది.

"పిచ్చిపిల్లా అట్లా బాధపడతావేం? నీకెప్పుడు రావాలనిపిస్తే అప్పుడే వచ్చెయ్యి. ప్రతి ఆదివారము వార్డెనుకు చెప్పి వస్తూ ఉండు." వీపు నిమురుతూ మణెమ్మ హేమలతను బండిలో కూర్చోబెట్టింది.

ఏనాటి మాట యిది? పది సంవత్సరాలయింది. ఈ పది సంవత్సరాలలో ఎన్నో మార్పులు జరిగాయి. హేమలత డాక్టరయింది. మెటర్నిటీ స్పెషలిస్టయింది. ప్రాణం పోతుందనుకున్న తల్లులకు నిరపాయకరంగా పురుడుపోసి పండువంటి పాపాయిలను చేతికిస్తున్నది. అనపత్యతతో క్రుంగితోయే స్త్రీల కెందరికో మాతృ త్వము కలిగించింది. వైద్యురాలిగా ఎందరికో బాధోపశమనము కలిగిస్తున్నది. తన సర్వశక్తులూ కూడగట్టుకుని మానవసేవ చేస్తున్నది.

ఈ పదిసంవత్సరాల కాలంలో 'అమ్మ' అన్న శబ్దం వినిపించినప్పుడల్లా మణెమ్మ జ్ఞాపకము వస్తూనే ఉన్నది. స్నేహితులలో మణెమ్మవంటి వారెవరయినా ఉన్నారేమోనని చూపులతో వెదుకుతూనే ఉన్నది. తన ఇరుగుపొరుగులలో అటు వంటి ఆమె ఎక్కడయినా ఉన్నదా అని గాలిస్తూనే ఉన్నది. తన రోగుల కెవరి కయినా అటువంటి ఉపచార భాగ్యము కలుగుతున్నదేమోనని ఆమె కళ్ళు పరిశో ధిస్తూనే ఉన్నాయి. ఆ ఆదరము ఆ వాత్సల్యమూ ఎక్కడ లభిస్తాయి? ఆతల్లి మణెమ్మ ఎక్కడ ఉన్నది?

ఆ ఊరినుంచి బదిలీ అయిపోయిన ఎన్నాళ్ళకో కుసుమ పెళ్ళికి ఆహ్వానము పంపాడు ఆమె అన్న. పెళ్ళికోసం కాదు మణెమ్మను చూద్దామని ఆశపడ్డది మనసు. ఆఖరి సంవత్సరం పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. తెల్లవార్లు చదివినా చాలటంలేదు. క్షమించమని నాలుగుపేజీల ఉత్తరం వ్రాసింది.

పెళ్ళి అయిన తరువాత కుసుమ ఉత్తరాలు వ్రాస్తూనే ఉంది. ఉత్తరమంతా ఆయనను గురించీ తన చిన్న సంసారాన్ని గురించీ వ్రాసేది. అమ్మ ఎక్కడున్నది అన్నమాటకు జవాబు యివ్వకుండా.

ఒంటరి జీవితమన్న మాటే గాని హేమలతకు ఆ వృత్తిలో ఒంటరితనాన్ని గురించి ఆలోచించటానికి తీరటం లేదు. హాస్పిటల్లో రోగులు, ఇంటికి వచ్చిపోయే రోగులు. ఇంటికివచ్చి తనను తీసుకుపోయే రోగులు-వాళ్ళకు వైద్యము, మందులు వీటితో కాలక్షేపము. ఉదయం లేచినప్పటి నుంచీ ఇదే వ్యాపకము. మందులూ, రోగులూ.... వైద్యము....జరిగినకాలాన్ని లెక్కవేసుకుంటే రెండేళ్ళు.

రాత్రి పదకొండు గంటలవేళ. హాస్పిటల్ ఆవరణలో డాక్టరుకోసం కేటాయించిన క్వార్టర్సులో మంచమ్మీద గుండెకు చేతులుచేర్చి పడుకుని కిటికిలో నుంచి వినీలాకాశంలో చుక్కలమధ్య పదహారు కళలతో మేఘమాలికలను తప్పించుకుంటూ పకపకనవ్వుతూ దాగుడుమూతలాడే ఆ జాబిల్లిని చూస్తున్నది. అంత నవ్వులోనూ ఆ చంద్రుడిలో మరునాటి నుండీ ఒక్కొకళ తరిగి పోతుందన్న దైన్యము తొంగిచూస్తూనే ఉన్నది. చంద్రకిరణాలు పక్కమీద పడుతూ ఉంటే హాయనిపిస్తున్నది. ఇంతచల్లగా ఇంతహాయిగా ఉండేది మణెమ్మన్నమాట. ఒక్కసారి మళ్ళీ తనకు జ్వరం వస్తే? మణెమ్మవచ్చి 'పిచ్చి పిల్లా' అంటూ వీపు మీద చెయ్యివేసి రాస్తూ పథ్యం తినిపిస్తే?

తలుపు కిర్రున చప్పుడయింది. నర్సు వచ్చి లేపింది 'సీరియస్ కేసు వచ్చింది. సిస్టరు రమ్మంటున్నది' అంటూ.

''పురిటి కేసా?'' కళ్ళు నులుముకుంటూ లేచింది.

''కాదు. గైనిక్ కేసు. మీరు త్వరగా రండి.''

నర్సును పోనిచ్చి స్టెతస్కోపు మెడలో తగిలించుకుని బయలుదేరింది. రోగికి నాడి బలహీనంగా ఉంది. ఋతుసంబంధమైన వ్యాధితో పాలిపోయి శుష్కించి ఉన్నది. హేమలత పరీక్షచేసి తాత్కాలికోపశమనం కోసం ఒక ఇంజక్షను ఇచ్చింది.

రోగి అమ్మా అని మూలిగినప్పుడు ఆ కంఠధ్వని ఎక్కడో విన్నట్లు ధ్వనిం

చింది. గుంటలుపడిన ఆ కళ్ళల్లో ఏదో వెలుగు తళుక్కున మెరిసింది. వెనక్కు తిరిగి ఆమె ముఖము చూస్తూ ముందుకు నడిచింది డాక్టరు.

మరునాడు రోజూకంటే అరగంట ముందుగావచ్చి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని నాడిచూస్తూ 'మీది ఈ ఊరేనా? వెంబడి ఎవరూ లేరా?' అడిగింది.

"మాది విశాఖపట్నము. పదికాన్పులు కన్నాను? నలుగురు బ్రతికారు. కాని వెంట ఎవరూలేరు" తన చూపులు గోడవైపుకు తిప్పుకొని చెప్పింది రోగి. నూతిలోంచి వచ్చినట్లున్నాయి మాటలు. ఆకొద్ది మాటలకే ఆయాసము వచ్చింది.

''మీరిలా ఉంటే వెంట ఒక్కరూ రాలేదా?''

"అవునమ్మా అందరికీ అన్నిపనులు సంసారాలు. నన్ను కనిపెట్టుకునిఉండాలంటే ఎట్లా?'' తల ఎత్తకుండానే ముఖాన్ని వాల్చుకున్నది.

''ఇక్కడికి ఎలావచ్చారు మరి?'' ఆశ్చర్యంతో అడిగింది డాక్టరు.

''చెల్లెల్ని చూద్దామని వచ్చాను. రాగానే జబ్బుచేసింది. చెల్లెలి కొడుకు ఇక్కడ చేర్చాడు.''

ఆమె పరిస్థితి ఆనాడు చాలా ఆదుర్దాగా ఉంది. ఆపరేషను చేస్తే గాని బాగుపడదు. ఆపరేషను చెయ్యటానికి రోగి దగ్గర శక్తిలేదు. రక్తము ఎక్కించాలని పెద్ద డాక్టరు అన్నాడు. సరిపడిన గ్రూపు రక్తముకోసం నాలుగురోజులు ఆలస్యము కూడా అయింది.

రోగి ముఖము ముడతలు ముడతలుగా ఒడిలిపోయింది. పళ్ళు లేకపోవటమువల్ల దవడలు లోపలికి పీక్కుపోయాయి. మాట స్పష్టంగా లేదు. అయినా హేమలతకు ఆమె నుండి ఏదో వినాలన్న ఆశలూ కాంక్షలూ మనసులో ఊరుతున్నాయి.

ఐదవనాడు ఆందోళనపడుతూ హేమలత తన రక్తముతీసి పరీక్ష చేయించింది. ముఖంలోవెలుగు తళుక్కుమన్నది, ఎంతో భక్తితో ప్రేమతో తన రక్తము తీసి ఆమెకు దానము చేసింది. మిగతా రోగులు ఆమె కొరకు డాక్టరు పడుతున్న శ్రమకు ఆశ్చర్యపడిపోతున్నారు.

తెల్లగా పాలిపోయి చావుబ్రతుకుల మధ్య ఉండి నోటకూటలేక పెదవులు కదుపుతూ ఉన్నదల్లా వారం తిరిగేసరికి కొత్తజీవం పోసుకొని నవనవలాడి పోయింది ఆమె. పక్కమీది నుంచి లేవలేకపోయినా మిగతా రోగుల నందరినీ మాట్లాడిస్తూ నవ్వుతూ కబుర్లు చెప్పుతున్నది. లేవలేకపోయినా అందరికీ సలహా లిస్తున్నది. ఆమరునాడు ఆమెకు ఆపరేషను చేశారు. ఆనాడంతా ఒంటిమీద తెలివిలేదు. హేమలత మూడురోజులపాటు ఆమెను కనిపెట్టుకుని ఉన్నది.

నాలుగవనాడు ఉదయము నాడి చూస్తూ ఉంటే 'తెల్లవారుఝామునుండీ కడుపునొప్పి తల్లీ!' అన్నది.

''నాకు కబురుపంపలేకపోయారా? వచ్చి ఏదయినా మందు ఇచ్చేదాన్నిగా?''

''తిరిగి తిరిగి అలిసిపోయిన బిడ్డను రాత్రిపూట నిద్ర అయినా పోకుండా పిలిపించనా? తెల్లవారగానే ఎలాగూ వస్తారుగా?''

ఆమె మాటలు వింటుంటే హేమలత దేహము జలదరించింది. మనసులో పేరుకుపోయిన మమతలేవో కదలించినట్లయింది.

''ఈ రోగులంతా కాస్త నొప్పిరాగానే హాలు ఎగిరిపోయేటట్లు కేకలు పెడ తారు. డాక్టర్ని పిలవమని అరుస్తారు. మీరు అవసరం వచ్చినప్పుడయినా పిలవ టానికి మొహమాట పడతారేం?''

హేమలత ఆమెను జాగ్రత్తగా పరీక్షచేసింది. కళ్ళల్లో ఆందోళన తొణి కిసలాడింది. పెద్దడాక్టరుమ పిలువనంపింది.

''మీరు చుట్టుపక్కల రోగులతో చాలా సరదాగా నిన్నామొన్నా మాట్లాడా రట నిజమేనా?''

''ఓపిక ఉంటే మాట్లాడకేం తల్లీ. పాపం వాళ్ళతో కులాసాగా మాట్లాడే వాళ్ళు లేక బెంబేలు పడుతున్నారు. మనసులు ఆనందంగా ఉంటే సగం రోగాలు తగ్గుతాయి. పాపం వాళ్ళనుచూస్తే జాలివేస్తుంది'' ముంజేతులు సవరించుకుంటూ ఒక్కొక్కమాటే అన్నది మెల్లగా.

పెద్దడాక్టరు వచ్చి రోగిలో కలిగిన మార్పు గమనించాడు. రెండు ఇంజక్షన్లు ఇవ్వమనిచెప్పి వెళ్లాడు. హేమలత రోగుల నందరినీ చూసి ఇంజక్షను యివ్వటానికి వచ్చేసరికి ఆమె ఫాలభాగమ్మీద చెయ్యిపెట్టుకొని కళ్లు మూసుకొని సన్నగా మూలుగుతున్నది.

"ఏమండీ మీఊరు ఎట్లా ఉంటుందో చెప్పలేదు?' సూదితో మందుఎక్కిస్తూ ఆమె ముఖంలోకి చూసింది హేమలత.

"మా ఊరా అమ్మా! ఆ ఊళ్ళో ఏముంది తల్లీ. నేను బాగా బ్రతికిన స్మృతి చిహ్నాలున్నాయి. ఆ ఊరిపేరు తలుచుకుంటే కడుపులో పేగులు కదులుతాయి" కన్నీళ్లు కణతలగుండా జారి తల వెంట్రుకలను తడుపుతున్నాయి.

"అయితే వద్దులెండి. మీకు ఈ ఇంజక్షనుతో బాగా నిద్రపడుతుంది. తలనొప్పి తగ్గిపోతుంది. మీకెప్పుడు అవసరమనిపిస్తే అప్పుడు నాకోసం చెప్పి పంపండి."

పన్నెండుగంటలకు క్వార్టర్సుకు వెళ్ళుతూ హేమలత ఆమె మంచం దగ్గరగా నిలబడి 'మీకు నిద్రరాలేదూ?' అడిగింది ముందుకు వంగి.

"లేదమ్మా. కడుపులో నరాలన్నీ పీకుతున్నాయి."

హేమలతకు ఆపూట అన్నం సహించలేదు. గబగబా వార్డుబాయిని పంపించి వేడినీళ్ళ సంచి తెప్పించి కాపుతూ కూర్చుంది.

"నాకు చిన్నప్పుడు కుసుమ అనే స్నేహితురాలు ఉండేది విశాఖపట్నంలో. నేను హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాను. ఓసారి కుసుమ తన యింటికి తీసుకువెళ్ళింది.... .... .... ...."

"నా రెండో కూతురు కుసుమ ఓసారి తల్లీ తండ్రీ లేని పిల్లను యింటికి తీసుకు వచ్చింది. పాపము ఆ పిల్లకు తల్లీ తండ్రీ ప్రేమ తెలియనే తెలియదు."

"ఆఁ ఆఁ. అవునవును" సంతోషం కొద్దీ నోరు తెరిచింది హేమలత.

ఆమెకు కళ్లు మూతలుపడుతున్నాయి. హేమలత వార్డంతా ఒకసారి తిరిగి మళ్ళీ ఆ మంచందగ్గర కూర్చుంది. రోగికి బాగా నిద్రపట్టినట్టుంది 'జాగ్రత్తగా చూడమని నర్సులకు చెప్పి క్వార్టర్సుకు వెళ్ళింది.

మరునాడు ఇంజక్షను యిస్తూ 'రాత్రి బాగా నిద్రపోయారా?' అడిగింది హేమలత.

ఆమె తల ఆడించింది.

''నన్ను చూసిన జ్ఞాపకము ఉన్నదా?''

''ఎప్పుడో ఎక్కడో చూశాననుకుంటున్నాను.''

''మీ యింటికి వచ్చి వారంరోజులు ఉన్న హేమలతను నేనే. మీరు మెత్తగా అన్నం వండిపెట్టారు. తలంటి నీళ్ళు పోశారు.''

''ఔనటమ్మా? నా తల్లే. ఎంత జ్ఞాపకము ఉందమ్మా నీకు?'' మాట పూర్తి కాకముందే కళ్ళ నీళ్ళు చెంపలవెంట ధారకట్టాయి.

''మీకు కాస్త తగ్గగానే నా క్వార్టర్సుకు వచ్చి ఉండాలి. అక్కడే ఉంచుకుని మందిస్తాను.''

''ఎంత చల్లటిమాట అన్నావు! అప్పుడే నా బాధంతా తగ్గిపోయినట్టుంది చూడు'' వొత్తిగిలి హేమ ముఖంలోకి చూసింది. ఆమె తల నిమరబోయింది కాని చెయ్యి పక్కకు వాలిపోయింది.

''మీరు పడుకోండి. ఒక్క గంటలో వస్తాను''.

హేమలత వార్డులో రోగులను చూడటానికి లేచింది.

ఆ పగలంతా వదెమ్మ మగతగా పడి ఉంది. ఆ సాయంత్రపువేళ కష్టపు కాన్పు కేసు వచ్చింది. అలిసిపోయిన హేమలత ఎనిమిదిగంటలకు పక్కమీద వాలింది. ఎప్పుడు నిద్రపట్టిందో నర్సు లేపితే లేచింది.

''డాక్టర్ ఆ మునలమ్మ కళ్ళు తేలవేసింది.''

ఆందోళనా భయమూ అడుగు ముందుకు పడకుండా అడ్డంవచ్చాయి. తడబడుతున్న కాళ్ళతో మంచం దగ్గరికి చేరుకుంది. రోగికి స్పృహలేదు. నాడి చేతికి అందటంలేదు. ఆమెకు స్పృహరావటానికీ నాడి సరిగాకొట్టుకోవటానికీ మందులూ

ఇంజక్షనులూ ఇవ్వాలని మనసు పాకులాడింది. తోచిన వైద్యమంతా చేసింది. ఆమె చూస్తూ ఉండగానే రోగి తుదిశ్వాస విడిచింది.

"ఒక్కసారి కళ్లు తెరిచి హేమా అని పిలవరూ! పిచ్చిపిల్లా అంటూ వీపు మీద చెయ్యివేసి రాయరూ!" ఆమె గొంతు ఎవరో నొక్కినట్లయింది.

ఆ చూపుకోసం—ఆ మాటకోసం హేమలత అహర్నిశలా కష్టించింది. ఫలితం దక్కలేదు. ఆమె మనసు తల్లడించిపోయింది. ఒక్క అంగలో క్వార్టర్సు చేరుకుంది. అడ్డంగా మంచమ్మీద పడిపోయింది. దుఃఖపు టలలు ఉవ్వెత్తున పైకి లేచి ఆమెను ఊపివేస్తున్నాయి.

ఉదయము ఆరుగంటల బస్సులో కుసుమ వస్తూనే హేమలత క్వార్టర్సుకు వచ్చింది "కుసుమా నా గుండె బద్దలయిపోతున్నది. కడుపులో పేగులు చుమ్మలు చుట్టుకు పోతున్నయి" కుసుమ బుజమ్మీద తలపెట్టి వెక్కివెక్కి ఏడ్చింది.

"హేమా నన్ను ఓదార్చవలసిందిపోయి నీవే ఏడుస్తున్నావా? అమ్మ పెద్దదయి పోయింది. అయినా నీవు ఎంతమంది రోగులను బ్రతికించగలిగావు చెప్పు? నచేతిలో ఎంతమంది రోగులు చనిపోలేదు? ఏమిటీ వెర్రి? డాక్టరువయి ఉండి ముఖం వాచేటట్లు ఏడుస్తున్నావా? అమ్మ అదృష్టవంతురాలు. ఆఖరిదశలో నీచేతి మీదుగా వెళ్ళిపోయింది" హేమలత ముఖాన్ని తనకేసి తిప్పుకుంది కుసుమ.

హాస్పిటల్లో ఆవార్డులో అడుగు పెట్టగానే హేమలత గుండె చెరువయి పోతున్నది. పదిరోజులు సెలవు పెట్టింది. క్వార్టర్సులో ఊరికే కూర్చుంటే మణెమ్మ ముఖం—ఆమె మాటలు గుండెను పిండేస్తున్నాయి. హేమలతకు దిగులు దిగులుగా ఎక్కడ కూర్చుంటే అక్కడే—ఎటువైపు దృష్టి మళ్ళితే అటే— పిచ్చికళ పడ్డది.

"సుమతి చూశావా ఒక్కసారయినా వచ్చిందికాదు" ఈమాట పదిసార్లు అనుకున్నది. చిందరవందరగా ఉన్న బల్లను శుభ్రపరుద్దామనుకున్నది. బీరువాలో ఎగుడు దిగుడుగా పడి ఉన్న పుస్తకాలు సర్దుదామనుకున్నది. బల్లమీద దుమ్ము కొట్టుకుపోతూ ఉన్న పాత ఉత్తరాలుతీసి బుట్టలో పడేద్దామనుకున్నది. మనసు దేని మీదా నిలవటంలేదు. మణెమ్మ ముఖం ఎత్తని అవనికలా ఏమూల చూసినా ఎటు వైపు చూసినా కనబడుతున్నది. 'హేమా! పిచ్చిపిల్లా........' అంటూ.

ఈ లోకమంతా కటిక చీకటి—మనసంతా చీకటి చీకటిగా ఉంది.

శనివారం ప్రొద్దున్నే తలుపు తోసుకుని లోపలికి వస్తున్నదెవరో సరిగా చూడకుండా డాక్టరు వెంకటచలం "అప్పలమ్మా. ఇల్లంతా గబగబా ఊడ్చెయ్యి. నీళ్లు కాగబెట్టు నేను లేచే లోపల కాఫీ ఇడ్లీ తీసుకురా హోటలునుంచి" తిరిగి ముసుగు బిగదన్ని పడుకున్నాడు.

కొంతసేపటికి వెంకటచలం కళ్ళు తెరిచి వప్పుకున్న సన్నటి దుప్పటిలో నుంచి చూశాడు. తలుపు సందులో నుంచి వెలుతురు వస్తున్నది. మధ్యలో ఎవరో నిలబడినట్లు నీడగా కనబడ్డది. అప్పలమ్మ ఇంతసేపు మాట్లాడకుండా అట్లా నిల బడి పోయిందేం? ఇంతసేపు మాట్లాడకుండా ఉండటం అప్పలమ్మకు చేతకాదే?

ఎవరైనా తనను తీసుకుపోవటానికి వచ్చారా?

"శనివారం దుర్ముహూర్తం దాటాలి, ఎనిమిదిదాటితేగాని నేను పక్కమీది నుంచి లేవను. ఎవరోగాని—తరువాత రండి"

హేమలత నవ్వాపుకోలేకపోయింది. కడుపు ఒకచేత్తో పట్టుకుని పక్కనున్న కుర్చీలో కూలబడ్డది.

వెంకటచలం ఆమెను చూసి ఆశ్చర్యపడ్డాడు. చెంపలు పీక్కుపోయాయి. కళ్ళు గుంటలు పడ్డాయి. దేహచ్ఛాయ వన్నె తిరిగింది.

"ఏమిటి హేమా. జబ్బుగాని చెయ్యలేదు కదా? పది లంఖణాలు చేసి నట్టున్నావు ఏమిటీ?" దుప్పటి అవతలికి నెట్టి క్రాపుసర్దుకుంటూ లేచాడు.

కాఫీ ఇడ్లీ అయిన తరువాత సిగరెట్టు ముట్టించి 'ఇహ చెప్పు' అన్నట్టు చూశాడు.

హేమలత తలవంచుకుని చేతివేళ్ళతో కుర్చీరాస్తూ 'చలం! నేను లాంగ్‌లీవు పెట్టాను. నాకు ఇక్కడికి మార్పించు. పెద్ద ఇల్లు తీసుకుని ముహూర్తం పెట్టించు' అన్నది.

వెంకటచలం తబ్బిబ్బయిపోయాడు "ముహూర్తం ! దానికి ఇప్పుడు వచ్చిందా వేళ? అందుకేనా అట్లా దిగులుపడ్డావు!" ఒక్క ఉదుటన కూర్చున్నచోటు నుంచి లేచి ఆమె భుజాలు పట్టుకుని ఊపేశాడు.

ఆమె హృదయంలో రెండు వాక్యాలు తల్లడించి పోతున్నాయి. 'అమ్మా అని పిలవటానికి నాకెవరూలేరు. నన్ను పిలిచేవాళ్ళు కావాలి.' గొంతులో ఉండ అడ్డుపడినట్టుగా ఉంది. మాట పెగిలి బయటికి రాలేదు.

"చలం ! చలం! నీ ట్లా ఉన్నావేం క్షౌరమన్నా చేసుకోకుండా?" అతడి గుండెలో తలదాచుకున్నది హేమలత మాట పైకి వినబడకుండా.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)